జగనన్న కాలనీలపై శీతకన్ను

- జమకాని బిల్లులు, అందని మెటీరియల్
- జగనన్న ఇళ్ల పథకానికి గ్రహణం
- తుప్పు పడుతున్న ఐరన్

భీమడోలు: జగనన్న నవరత్నాలు పేదలందరికీ ఇళ్లు పథకంపై కూటమి సర్కార్ శీతకన్ను వేసింది. ఈ పథకానికి ఇళ్ల సర్వే పేరిట గ్రహణం పట్టించింది. ఇళ్లు నిర్మాణ లబ్ధిదారుల వివరాలపై దృష్టి పెట్టింది. బిల్లులు జమకాక పోవడం, ఇసుక, ఐరన్ వంటి మెటీరియల్ ఇవ్వకపోవడంతో పేదల సొంతింటి కల సాకారం కావడంలేదు. అప్పులు చేసి గృహ నిర్మాణం చేపట్టిన లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇళ్లు నిర్మాణ పనులు నిలిచిపోయాయి. మొండి గోడలు దర్శనమిస్తాయి. భీమడోలు హౌసింగ్ కాలనీ వద్ద ఉన్న ఐరన్ తుప్పు పట్టింది. లబ్ధిదారులకు అందించాల్సిన ఐరన్‌ను భద్రత పర్చడం సిబ్బందికి భారంగా మారింది. భీమడోలు మండలంలో 27 లేఅవుట్లలో 1,254 ఇళ్లు మంజూరు కాగా, 934 మంది గృహ నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయి. 320 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభించలేదు. చంద్రబాబు కొత్తగా ప్రకటించిన రూ.4 లక్షల పథకాన్ని తమకూ అమలు చేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.

కొత్త ఊళ్లుగా రూపుదిద్దుకున్న జగనన్న కాలనీ ఇళ్లు

పేదలందరికీ ఇళ్లు పథకంలో దేశచరిత్రలోనే మునుపెన్నడూ లేని విధంగా మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కోట్లాది రూపాయలతో భూములు కొనుగోలు చేసి అర్హులకు ఇళ్ల స్థలాలను అందించారు. రూ.1.8 లక్షల నగదు ఇంటి నిర్మాణానికి జమ చేశారు. దీంతో ప్రతి లబ్ధిదారునికీ రూ.6 లక్షల నుంచి రూ.7 లక్షల వరకు ఆస్తి సమకూరింది. ఉంగుటూరు నియోజకవర్గంలో 4 వేల మందికి పైగా సొంతింటి కల సాకారానికి అడుగులు పట్టాయి. 30 నుంచి 40 శాతం మంది లబ్ధిదారులు ఇళ్లు నిర్మించుకున్నారు. సార్వత్రిక ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిన నాటి నుంచి కూటమి నాయకులు జగనన్న ఇళ్లపై విషం కక్కారు. ఇళ్ల నిర్మాణం పనులు పూర్తిచేసిన వారికి బిల్లులు రాకుండా అడ్డుకున్నారు. ఎన్నికల పూర్తయిన తర్వాత బిల్లులు జమవుతాయని భావించిన లబ్ధిదారులకు నిరాశ ఎదురైంది. 2014 నుంచి 2019 వరకు చంద్రబాబు హయాంలో ఇళ్లు నిర్మించుకుని బిల్లులు పడని వారికి జాబితాలను సిద్ధం చేసుకుని సర్వే చేస్తోంది. వారికి ప్రాధాన్యత ఇస్తోంది.


భీమడోలు హౌసింగ్ కార్యాలయం వద్ద తుప్పు పట్టిన ఐరన్


అంబర్‌పేట జగనన్న కాలనీలో దర్శనమిస్తున్న మొండి గోడలు

సాంకేతిక సమస్యతో జాప్యం



జగనన్న ఇళ్ల నిర్మాణ పథకంలో ఇళ్లు నిర్మించుకుంటున్న లబ్ధిదారులకు సాంకేతిక సమస్యల వల్ల కొంత జాప్యం ఏర్పడింది. ప్రస్తుతం బిల్లులు జమవుతున్నాయి. లబ్ధిదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. జగనన్న కాలనీల్లో లబ్ధిదారులు ఇళ్ల ప్రారంభించాలి. వివిధ దశల్లో ఉన్న నిర్మాణాలకు బిల్లులు జమవుతున్నాయి. కార్యాలయం వద్ద ఉన్న ఐరన్ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతాం.

– చైతన్య, ఏఈ, హౌసింగ్, భీమడోలు

రాట్నాలమ్మ సేవలో కొఠారు


రాట్నాలమ్మవారికి హారతి ఇస్తున్న అబ్బయ్యచౌదరి

పెదవేగి : మండలంలోని రాట్నాలకుంట రాట్నాలమ్మవారిని, ఆలయ ప్రాంగణంలో ఉన్న రామలింగేశ్వరస్వామి వారిని మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి శుక్రవారం దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు చేశారు. దెందులూరు నియోజకవర్గ ప్రజలందరూ సుఖశాంతులతో వర్ధిల్లాలని అమ్మవారిని కోరుకున్నట్టు కొఠారు తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉన్నారు.

యువకుడికి తీవ్ర గాయాలు

భీమడోలు: జాతీయ రహదారిపై గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడి కాలు విరిగింది. గాయడిన చినలింగంపాడు గ్రామానికి చెందిన రాచప్రోలు భానుప్రకాష్‌ను చికిత్స నిమిత్తం ఏలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. గురువారం రాత్రి గుడివాకలంక గ్రామం నుంచి పూళ్ల వెళ్తున్న సౌండ్ సిస్టం వ్యాన్ పూళ్ల సెంటర్‌లో రోడ్డు క్రాస్ చేసి హైవేపై ఆగింది. ఆ సమయంలో తాడేపల్లిగూడెం నుంచి ఏలూరు వైపుగా వెళ్తున్న లారీ డ్రైవర్ అతివేగంగా వచ్చి వ్యాన్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సౌండ్ సిస్టం వ్యాన్‌పై ఉన్న భానుప్రకాష్ కుడి కాలి విరిగింది. ఈ మేరకు కేసును ఎస్సై వై.సుధాకర్ దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా

డీఎన్నార్ దృష్టికి స్థానిక సమస్యలు


డీఎన్నార్‌కు సమస్యలు వివరిస్తున్న డీబీఆర్‌కే చౌదరి

దెందులూరు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరావు (డీఎన్నార్) అన్నారు. శుక్రవారం మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బాయి చౌదరి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడిన నాలుగు నెలల కాలంలోనే ఏర్పడిన ప్రజా వ్యతిరేకత, అసంతృప్తిని పసిగట్టి డైవర్షన్ పాలిటిక్స్ ప్రజలపై రుద్దుతున్నారని వివరించారు. సోషల్ మీడియాలో యాక్టివ్‌గా ఉన్న వైఎస్సార్ సీపీ శ్రేణులపై అక్రమ కేసులు బనాయిస్తే ప్రజల్లో ఉన్న అసంతృప్తి వ్యతిరేకత పోతుందా అని ప్రశ్నించారు. ఈ సందర్భంగా పార్టీ దెందులూరు మండలం నాయకులు డీబీఆర్‌కే చౌదరి పలు సమస్యలను డీఎన్నార్, మాజీ ఎమ్మెల్యేలు కొఠారు అబ్బయ్యచౌదరి, పుప్పాల వాసుబాబు దృష్టికి తీసుకెళ్లారు.

పసుపు కొమ్ములు, కుంకుమ పూజ


స్వామి, అమ్మవార్ల వద్ద పోసిన పసుపు కొమ్ములు

భీమడోలు: గుండుగొలనులో భ్రమరాంబికా మల్లేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం లక్ష పసుపు కొమ్ములు, లక్ష కుంకుమార్చన పూజలు వైభవంగా నిర్వహించారు. కార్తీక మాసోత్సవాల్లో భాగంగా స్వామి, అమ్మవార్లకు విశేష పూజలు చేశారు. రాజరాజేశ్వరి అమ్మవారికి గ్రామోత్సవం నిర్వహించారు. మహిళలు పెద్ద ఎత్తున పూజల్లో పాల్గొన్నారు. లోక కల్యాణార్థం, గ్రామ క్షేమం కోరుతూ ఆలయంలో లక్ష రుద్రాక్ష పూజ చేశామని అర్చకులు లంకా శ్రీనివాస్, శివకుమార్‌లు తెలిపారు.

పత్తేపురం విద్యార్థులకు అభినందన


విద్యార్థులను అభినందిస్తున్న హెచ్‌ఎం సత్యనారాయణ

నిడమర్రు: సర్వోదయ మండలి ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో నిర్వహించిన ఆన్‌లైన్ వ్యాసరచన, కవిత్వం, కథల పోటీల్లో పత్తేపురం మూర్తిరాజు జెడ్పీ స్కూల్ విద్యార్థులు విజేతలుగా నిలిచారని ఎంఈఓ పుచ్చల శేషు తెలిపారు. శుక్రవారం ఆ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో విజేతలైన పదోతరగతి విద్యార్థులు చొక్కాకుల శరణ్య, పొత్తూరి శ్రీ భవిత, రొక్కల సంతోష్ కుమార్‌లను అభినందించారు. అమ్మాయిల పట్ల వివక్షతో విపత్తు, స్వర్ణాంధ్ర విద్యతోనే సాధ్యం వంటి అంశాలపై పోటీలు నిర్వహించినట్టు చెప్పారు. గ్రామ సర్పంచ్ సాయిప్రియ, ఉప సర్పంచ్ కొండయ్య, ఎస్ఎంసీ చైర్మన్ ఎన్ దేవి పాల్గొన్నారు.

నిడమర్రులో ప్రజాపోరు యాత్ర

నిడమర్రు: టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చిన 100 రోజుల్లో ధరలు పెరగడంతోపాటు విద్యుత్ చార్జీల బాదుడు ప్రారంభించారని సీపీఎం మండల కన్వీనర్ నారపల్లి రమణారావు ఆరోపించారు. శుక్రవారం నిడమర్రు గ్రామంలో ఆ పార్టీ ప్రజా పోరు యాత్రను ప్రారంభించారు. అధికారం కోసం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు విస్మరించి ప్రజ లు మోసం చేసిందని రమణారావు విమర్శించారు. విద్యుత్ చార్జీలు తగ్గిస్తానని, నాణ్యమైన కరెంట్ అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం చంద్రబాబు స్మార్ట్ మీటర్లు బిగించడాన్ని వ్యతిరేఖిస్తున్నట్టు చెప్పారు. ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో కోన శ్రీనివాసరావు, గవర సత్యనారాయణ, వెలగలేటి మోహన్, కానూరు రాజు పాల్గొన్నారు.

మహిళను వేధించిన వ్యక్తి అరెస్ట్

ఏలూరు టౌన్: ఏలూరులో న్యాయవాద వృత్తిలో ఉంటూ ఒక మహిళను వేధింపులకు గురిచేసిన ఒక వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. పెదవేగి మండలం కొండలరావుపాలెం గ్రామానికి చెందిన ఆళ్ల సత్యనారాయణ ఏలూరులో న్యాయవాదిగా ప్రాక్టీస్ చేస్తున్నారు. ఒక వివాహితను సెల్‌ఫోన్‌కు వాట్సాప్‌లో అసభ్యకరమైన మెసెజ్‌లు పంపుతున్నారంటూ మహిళ ఏలూరు వన్‌టౌన్ పోలీసులకు 2021లో ఫిర్యాదు చేసింది. దీంతో వన్‌టౌన్ పోలీసులు సత్యనారాయణను శుక్రవారం అరెస్టు చేశారు.

ఆరోగ్య నియమాలు పాటించాలి

ఉంగుటూరు: ఆరోగ్య నియమాలు, పరిసరాల పరిశుభ్రత పాటించాలని తాడేపల్లిగూడెం సబ్ యూనిట్ అధికారి వైవీ లక్ష్మణరావు అన్నారు. ఫ్రై డే డ్రై డే కార్యక్రమాల అమలును క్షేత్ర స్థాయిలో ఆయన శుక్రవారం పరిశీలించారు. కాగుపాడు పీహెచ్‌సీ పరిధిలోని 1, 2, 10, 8 క్లస్టర్లలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఇంటి పరిసరాల్లో నీటినిల్వలు లేకుండా వారానికోసారి ఫ్రై డే డ్రై డే పాటించి, దోమలను అరికట్టాలన్నారు. ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాలను సందర్శించి విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారి కమతవరపు శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు సత్యనారాయణ, గ్రామ ఆరోగ్య కార్యదర్శి విజయ, ఆశ, ఉష, నాగమణి, దుర్గ, భవాని ఆరోగ్య సహాయకులు ఎం శ్రీనివాసరాజు, అంగన్‌వాడీ కార్యకర్తలు శ్రీలత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.


పరిశుభ్రతను పరిశీలిస్తున్న వైవీ లక్ష్మణరావు

యానిమేటర్లపై వేధింపులు తగవు

నిడమర్రు: ఐకేపీ యానిమేటర్స్‌పై రాజకీయ వేధింపులు తగదని మండల యానిమేటర్స్ శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద కొద్దిసేపు ధర్నా చేశారు. దేవుని విజయలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన ఈ ధర్నాలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షులు నారపల్లి రమణారావు మాట్లాడుతూ తాజాగా ప్రభుత్వ జారీ చేసిన కాలపరిమితి సర్కులర్ రద్దు చేయాలన్నారు. ఇప్పటికే ఆరు నెలలుగా జీతాలు ఇవ్వడం లేదని తెలిపారు. మహిళా మార్టుల్లో బలవంతపు సరుకులు కొనుగోలును నిలుపుదల చేయాలన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా నిబంధనలకు విరుద్ధంగా వీవోఏలను తొలగించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దారు నాగరాజు, ఎంపీడీఓ విజయ కుమారిలకు వినతిపత్రం అందించారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు సీహెచ్ వరలక్ష్మి జి.పద్మావతి, స్వరూప, రాధా, జిమల్లేశ్వరి, రాజ్యలక్ష్మి, కమల పుష్ప తదితరులున్నారు.


తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న యానిమేటర్లు

వరి సాగు విధానం పరిశీలన

దెందులూరు: పంట కోత ప్రయోగం, రైతుసేవా కేంద్రాల పనితీరును ఢిల్లీ నుంచి వచ్చిన బృందం పరిశీలించినట్టు వ్యవసాయశాఖ ఇన్‌చార్జి అధికారి దామా వెంకటేశ్వర్లు తెలిపారు. శుక్రవారం గోపన్నపాలెం, గాలాయగూడెం గ్రామాల్లో రైతు సేవా కేంద్రం, వరి పొలాలను బృందం పరిశీలించిందన్నారు. రైతులతో ముఖాముఖి నిర్వహించిందని తెలిపారు. సాగు చేసే విత్తనం, ఖర్చు, దిగుబడి, వాతావరణ పరిస్థితులు, రవాణా, ఇతర అంశాలపై ఆరా తీసిందని చెప్పారు. వ్యవసాయ శాఖ అధికారులు, శాస్త్రవేత్తల సూచనలు సలహాలు నిరంతరం తీసుకోవాలని రైతులకు సూచించినట్టు చెప్పారు. గాలాయగూడెంలో రైతు డి.చింతయ్య పొలంలో పంటకోత ప్రయోగాన్ని పర్యవేక్షించిందన్నారు. నేషనల్ ప్రోగ్రాం డైరెక్టర్ అజయ్ సింగ్ కొడవలి పట్టి పొలంలోవరి దుబ్బు కోసి స్థానికంగా వరి కోతలను ప్రారంభించారు. యూఎన్‌డీపీ నేషనల్ ప్రొగ్రామ్ డైరెక్టర్ అజయ్ కె.సింగ్, ఏపీ టెక్నికల్ యూనిట్ ఇన్‌చార్జి మహారాజన్, జేడీ హబీబ్ బాషా, డీడీ ఎ.వేణుగోపాల్ పాల్గొన్నారు.


పంట కోతలను పరిశీలిస్తున్న సెంట్రల్ టీమ్ సభ్యులు

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండండి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): అందుబాటులోకి వచ్చిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ఇటీవల సైబర్ నేరగాళ్ల ప్రజలను సులువుగా మోసం చేస్తున్నారని, వీటిపై అప్రమత్తంగా వ్యవహరించాలని ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ మహిళా ఎస్సై నాగ కళ్యాణి అన్నారు. ఎస్పీ కె.ప్రతాప్ శివ కిషోర్ ప్రవేశపెట్టిన అభయ ప్రోగ్రామ్ గురించి శుక్రవారం డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ వైవీ రమణ ఆధ్వర్యంలో స్థానిక గాంధీనగర్ నగరపాలక ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఆపద సమయంలో పోలీసు సాయం కోసం డయల్ 112కు ఫోన్‌లో సమాచారం ఇస్తే, 10 నిమిషాల్లో భద్రత కల్పిస్తారని ఎస్సై నాగ కళ్యాణి తెలిపారు. బాల్య వివాహాలకు పూనుకుంటే 1098కు, సైబర్ నేరాలకు గురైతే 1930కి సమాచారం అందించాలన్నారు.

14 నుంచి క్యాన్సర్ పరీక్షలు

పెదవేగి : జాతీయ క్యాన్సర్ డేని పురస్కరించుకుని మండలంలోని పెదవేగి, విజయరాయి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో ఇంటింటి సర్వే నిర్వహించనున్నట్టు పీహెచ్‌సీల వైద్యులు ప్రత్యూష, మాధవిలు శుక్రవారం తెలిపారు. ఈ నెల 14న పెదవేగి మండలంలో క్యాన్సర్ సర్వేను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. అవగాహనా కార్యక్రమాలు తొమ్మిది నెలల పాటు కొనసాగుతాయని వివరించారు. ప్రజలు సర్వేకు సహకరించాలని డాక్టర్లు కోరారు.

నేటి నుంచి ప్రత్యేక ఓటర్ల నమోదు

భీమడోలు: మండలం పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 9, 10, 23, 24వ తేదీల్లో ప్రత్యేక ఓటర్ల నమోదు చేయనున్నట్టు తహసీల్దార్ బి.రమాదేవి శుక్రవారం తెలిపారు. మండలం పరిధిలోని 53 పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సిబ్బంది శనివారం ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు.

నవగ్రహ మండపానికి శంకుస్థాపన

ఉంగుటూరు: కదంబ వనవాసిని భద్రకాళి మహ మందిరంలో నవగ్రహ మండప నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేశారు. పాతూరి వెంకటేశ్వరరావు, తూతిక శ్రీనివాసరావు, నారాయణ హనుమంతరావు, యడ్లపల్లి వెంకటరావు, మంత్రి రమణారావు, కొల్లి పెద్దిరాజు, పాతూరి వంశీకృష్ణ, భద్రకాళి సేవాదళం సభ్యులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన

పెదపాడు : గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదపాడు మండలం వసంతవాడ, తోటగూడెం, రామచంద్రపురం, అందేఖాన్ చెరువు కొత్తూరు గ్రామాల్లో శుక్రవారం ఆయన పల్లె పండుగ పనులను పరిశీలించారు. కూటమి నాయకులు పాల్గొన్నారు.

వరల్డ్ రేడియాలజీ డే

దెందులూరు: స్థానిక నర్సింగ్ కళాశాలలో రేడియాలజీ దినోత్సవాన్ని నిర్వహించారు. శుక్రవారం కళాశాలలో విద్యార్థులకు రేడియాలజీపై అవగాహన కల్పించినట్టు కరస్పాండెంట్ సుగ్గిశెట్టి సూకరాజు తెలిపారు. విద్యార్థులు సునీత, ఐశ్వర్య మాట్లాడారు.

అండర్‌పాస్‌లో తొలగని నీరు

దెందులూరు: దెందులూరు – అలుగులగూడెం రైల్వే గేట్ వద్ద అండర్‌పాస్‌లో నీరు నిల్వ ఉండి ప్రయాణికులకు రాకపోకలకు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. అండర్‌పాస్ నుంచి నిత్యం విద్యార్థులు, వృద్ధులు, రైతులు, పాదచారులు రెండు మండలాల ప్రయాణికులు రాకపోకలు సాగిస్తుంటారు. అండర్‌పాస్‌లో నీటి సమస్యకు పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

మత్తు పదార్థాలతో అనర్థం

ఉంగుటూరు: యువత మత్తుపదార్థాలు, అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని చేబ్రోలు ఎస్సై ఎంఎస్ భగవాన్ అన్నారు. నారాయణపురం శ్రీ అరవింద శత జయంతి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డ్రగ్ ఫ్రీ ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా మత్తు పదార్థాలపై అవగాహన, యాంటీ ర్యాగింగ్‌పై ప్రిన్సిపాల్ టీకే విశ్వేశ్వరరావు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఎస్సై భగవాన్ మాట్లాడుతూ యువత సరదాల కోసం మత్తు పదార్థాలకు బానిసలై విలువైన జీవితాలు నాశనం చేసుకోవద్దని సూచించారు. మత్తుపదార్థాల వల్ల శక్తి సామర్థ్యాలను కోల్పోతున్నారని, చివరకు ఫైల్యూర్స్‌గా మిగిలిపోతున్నారని వివరించారు. విద్యార్థులు శారీరక, మానసిక ఆరోగ్యంతో పాటు సామాజిక ఆరోగ్యాన్ని పెంపొందించాలని కోరారు. ర్యాగింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు. సైబర్ క్రైమ్‌ల పట్ల అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అనవసర కాల్స్, లింక్స్ జోలికిపోవద్దని, వ్యక్తిగత ఖాతా నుంచి సొమ్ము పోతే 1930కి ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో అకడమిక్ కో ఆర్డినేటర్ కొండా రవి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి హెప్సిబా, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ రెడ్డియ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్సై ఎంఎస్ భగవాన్

ఏలూరులో 'అభయ' రక్షక దళం గస్తీ

ఏలూరు టౌన్ : ఏలూరు నగరంతో పాటు జిల్లా వ్యాప్తంగా మహిళలు, యువతులు, విద్యార్థినుల భద్రతకు ప్రాధాన్యతనిస్తూ ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్ జిల్లాలో అభయ రక్షక దళాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్యంగా ఏలూరు నగరంలో ఉదయం, సాయంత్రం వేళల్లో వేలాది మంది విద్యార్థినులు ఇళ్ల నుంచి బడులకు, కళాశాలలకు వెళ్తుంటారు. ఇదే సందర్భంలో కళాశాలల వద్ద, విద్యా సంస్థల వద్ద ఆకతాయిలు వేధింపులకు గురిచేస్తున్న నేపథ్యంలో ప్రత్యేక రక్షక దళాన్ని ఏర్పాటు చేశారు. మహిళా పోలీస్ సిబ్బంది ప్రత్యేక డ్రెస్ కోడ్‌తో అభయ వాహనాలతో నగరంలో తిరుగుతూ విద్యార్థినులకు ఇబ్బందులు లేకుండా అండగా నిలబడుతున్నారు. విద్యార్థినులకు ఆపద వస్తే డయల్ 112కు, అభయ యాప్‌లో పోలీసులకు సమాచారం ఇస్తే 10 నిమిషాల్లో చేరుకుని ఆకతాయిల బరతం పడతామని విద్యార్థినులకు అవగాహన కల్పిస్తున్నారు.


సెయింట్ థెరిస్సా వద్ద విద్యార్థినులతో అభయ రక్షక దళం

పోష్ చట్టంపై అవగాహన

ఏలూరు (టూటౌన్): పోష్ చట్టంపై అవగాహన పెంపొందించుకోవాలని ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్న ప్రసాద్ అన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో మహిళా ఉద్యోగులకు పోష్ యాక్ట్ 2013, సంస్థల్లో విధులు నిర్వహిస్తున్న మహిళా ఉద్యోగులపై లైంగిక వేధింపుల నిరోధం అనే అంశంపై శుక్రవారం ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో రత్నప్రసాద్ మాట్లాడారు. మహిళలపై లైంగిక వేధింపులను అరికట్టడానికి అనేక చట్టాలు రూపొందించారని, ఈ చట్టాలలో భాగంగా పోష్ యాక్ట్‌ను తీసుకొచ్చారని వివరించారు. మహిళా ఉద్యోగుల రక్షణకు కమిటీలు ఏర్పాటు చేయాలని, ఎవరికైనా వేధింపులకు గురైతే కమిటీకి ఫిర్యాదు చేసుకోవచ్చని తెలిపారు. కమిటీ సభ్యుల వివరాలను సంబంధిత కార్యాలయంలో ఉంచాలన్నారు. ఫిర్యాదు చేసిన మహిళా ఉద్యోగులు వివరాలు గోప్యంగా ఉంచుతారని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనీ జడ్జీలు వి.రఘునాథ్, టీఏఎస్ఎస్ఆర్ ఆదిత్య రిషిక్, ఏవీ నాగరాజు, కె.స్పందన, జేబీటీఎస్ దేవి, కుమారి, డి.అరుంధతి ప్యానల్ లాయర్లు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డీఎల్ఎస్ఏ కార్యదర్శి రత్నప్రసాద్

ఎస్పీ శివ కిషోర్‌కు మహిళ కృతజ్ఞతలు

ఏలూరు టౌన్ : చోరీకి గురైన తన మోటారు సైకిల్‌ను పోలీసులు పట్టుకుని ఇవ్వడంతో ఓ మహిళ ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిషోర్‌ను శుక్రవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో కలిసి కృతజ్ఞతలు తెలిపింది. ఏలూరు పవరు పేట వాసావారివీధికి చెందిన నేల అలివేణి అనే మహిళ తన మోటారుసైకిల్ గత నెల 23న చోరికి గురైంది. ఆమె టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. మోటారుసైకిళ్ల చోరీపై ప్రత్యేక బృందాలు గత నెల 27వ తేదీన 25 మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. వీటిలో అలివేణి మోటారు సైకిల్ కూడా ఉంది. ఆమెకు మోటారు సైకిల్ ఇవ్వడంతో ఆనందం వ్యక్తం చేసింది.

రైతుకు ప్రతికూల పరిస్థితులు

- వాతావరణ మార్పులతో నష్టం
- యంత్రాలతో వరి కోతలు

దెందులూరు: సేంద్రియ వ్యవసాయంతో పాటు అంతర పంటసాగులో అద్భుతాలు సృష్టించిన గ్రామాల్లో నేడు వాతావరణ పరిస్థితులు రైతుల పాలిట శాపంగా మారాయి. కొన్నేళ్లుగా వర్షాలతో తీవ్రంగా నష్టపోతున్నారు. అప్పు తెచ్చి సాగు చేసి పంట చేతికి వచ్చే సమయానికి వర్షాలు, వరదలు రైతుకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. వాతావరణ ప్రతికూల పరిస్థితులతో పంటలపై పెట్టిన పెట్టుబడి సైతం చేతికి రాకపోవడంతో అప్పులపాలవుతున్నారు. దెందులూరు నియోజకవర్గం నాలుగు మండలాల్లో సార్వాలో 47 వేల ఎకరాల్లో వరి సాగు చేశారు. అధికంగా 1318 స్వర్ణ రకం వరి సాగు చేశారు. పంట కోతకు వచ్చే సమయానికి తుఫాను ప్రభావంతో వర్షాలు కురిసి రైతన్నల నడ్డివిరుస్తున్నాయి. కోతలు రెండు వారాల్లో ప్రారంభమవుతాయనుకునే సమయానికి ఇటీవల వచ్చిన తుఫాన్‌కు దాదాపు గ్రామాల్లో వరి పంట నేలకొరిగింది. దీంతో కూలీలతో వరి కోతలు కోయిస్తున్నారు. ఎకరానికి యంత్రంతో అయితే రూ.30 వేలు ఖర్చు అవుతుంది. కూలీలకు కూడా దాదాపు అంతే ఖర్చు అవుతుంది. రైతు భరోసా హామీని కూటమి ప్రభుత్వం గాలికి వదిలేయడంతో రైతుల్లో తీవ్ర నిరుత్సాహం అలముకుంది.


యంత్రాలతో వరి కోతలు

120 ఎకరాల్లో కోతలు పూర్తి



దెందులూరు నియోజకవర్గంలో 120 ఎకరాల్లో వరి కోతలు పూర్తయ్యాయి. రైతులందరూ వరికోతల్లో నిమగ్నమయ్యారు. ధాన్యం కొనుగోలుకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభమయ్యాయి. ఈ కేంద్రాల్లోనే రైతులు ధాన్యం అమ్ముకోవాలి.

– సుబ్బారావు, అసిస్టెంట్ డైరెక్టర్ వ్యవసాయ శాఖ


మోసం చేశారు



గత ప్రభుత్వంలో రైతులకు పెద్దపీట వేశారు. రైతు భరోసా సమయానికి అనుకూలంగా రైతుల ఖాతాలకు జమయ్యేది. కూటమి ప్రభుత్వం రైతులను కుదేలు చేసింది ఎన్నికల ప్రచారంలో రైతు ప్రభుత్వం అంటూ నానా మాటలు చెప్పి మోసం చేశారు.

– పర్వతనేని నరేంద్ర, రైతు, మలకచర్ల

హామీని నిలబెట్టుకోవాలి



ఎన్నికల ముందు అన్ని ప్రచార సభల్లో రైతులకు లోటు రానివ్వం సాగు సాయం అందిస్తామని వాగ్దానం చేశారు. వరి కోతలు ప్రారంభమైనా ప్రభుత్వం రైతులకు పెట్టుబడి సాయం చేయకపోవడం విచారకరం. రైతులంతా అప్పుల పాలయ్యారు.

– కె.శ్రీనివాసరావు, ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి